క్లుప్తంగా

రైతులు ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలి

ఏవో కె.దేవదాసు

నకరికల్లు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలను పొందేందుకు అర్హత కలిగిన రైతులందరూ రైతు సేవ కేంద్రంలో ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. మండలంలో 9,717 మంది రైతులను అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. రైతు పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు

ఏపీవో కోటమ్మ



పెదకూరపాడు : జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఏపీవో కోటమ్మ తెలిపారు. గురువారం పెదకూరపాడులో ఉపాధి కార్మికులతో ఆమె సమావేశం నిర్వహించారు. కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పనులు చేస్తున్నట్లు చెప్పారు. పనుల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒకరి పేరుపై మరొకరు పనులకు రావద్దని కార్మికులకు సూచించారు.

నేడు జాబ్ మేళా

సత్తెనపల్లి: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఈ నెల 13 శుక్రవారం సత్తెనపల్లిలోని అచ్చంపేటరోడ్‌లో రైల్వే గేటు దగ్గర గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు గురువారం తెలిపారు. ఈ జాబ్ మేళాకు సుమారు 10 కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. జీతం విద్యార్హతను బట్టి ఉంటుందన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదువుకున్న 18–35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీయువకులు సంబంధిత పత్రాల నకళ్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు రామకృష్ణారెడ్డి-8074393466, అంజిరెడ్డి-9494986164 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఔత్సాహికులు https: // naipunyam. ap. gov. in/ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్లంకొండ ఎంపీడీవోగా సునీత



బెల్లంకొండ: మండల పరిషత్ కార్యాలయం నూతన ఎంపీడీవోగా పి.సునీత గురువారం బాధ్యతలు చేపట్టారు. గత నెలలో ఎంపీడీవోగా విధులు నిర్వహించిన వై.హనుమారెడ్డి పదోన్నతిపై కృష్ణా జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారిగా వెళ్లారు. కాగా కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ నాయక్ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా చీరాలలో పనిచేస్తున్న సునీత బదిలీపై బెల్లంకొండ మండలానికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఆయుష్ హాస్పిటల్‌ను పునరుద్ధరించాలి



నకరికల్లు: శిథిలావస్థలో ఉన్న నకరికల్లు ఆయుష్ హాస్పిటల్‌ను పునరుద్ధరించి డాక్టర్లను కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన నకరికల్లులో గత 50 సంవత్సరాలుగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, పట్టించుకునే నాథుడు కరువయ్యారన్నారు. కనీసం వైద్య సిబ్బందిని కూడా నియమించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి శిథిలమైన భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించి వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆయుర్వేద వైద్యం పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు వి.కోట నాయక్, కె.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో... గ్రామ సింహాలు..!

- కుక్కల బెడదతో భయాందోళనలో ప్రజలు
- వీధుల్లో పదుల సంఖ్యలో సంచరిస్తున్న వైనం
- ఆరు నెలల్లో 276 మంది బాధితులు
- చోద్యం చూస్తున్న అధికారులు



వీధుల వెంట గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

బెల్లంకొండ: గ్రామాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామాలలో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో కుక్కల సంఖ్య గ్రామాలలో విపరీతంగా పెరిగిపోతుంది. మండలంలో ఏ గ్రామంలో చూసినా వీధుల వెంట పదుల సంఖ్యలో గ్రామ సింహాలు దర్శనమిస్తున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా వీధులలో తిరుగుతూ నానా హంగామా సృష్టిస్తున్నాయి. కుక్కలు ఎప్పుడు మీద పడి కరిచేస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు. కుక్కల వల్ల చిన్నారులకు ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందేమోనని బిక్కు బిక్కుమంటు ఉంటున్నారు.

ఆరు నెలల్లో 276 మంది బాధితులు

గత ఆరు నెలల వ్యవధిలో 276 మంది కుక్క కాటుకు గురైనట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు. జనవరి నెలలో 53 మంది, ఫిబ్రవరిలో 56 మంది, మార్చిలో 47, ఏప్రిల్‌లో 62, మేలో 49 మంది, జూన్‌లో ఇప్పటి వరకు 9 మంది కుక్క కాటుకు గురై చికిత్స కోసం వచ్చినట్లు వారు తెలిపారు.

పంచాయతీ అధికారుల చర్యలు శూన్యం

గ్రామాలలో కుక్కల బెడద అధికంగా ఉన్నా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, మాచాయపాలెం, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లోని వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అంతేకాకుండా కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. అదే విధంగా గ్రామాల్లో మాంసం విక్రయ కేంద్రాలు అధికంగా ఉండటంతో వ్యర్థ పదార్థాలు తినడానికి కుక్కలు తిష్ట వేసి పాదచారులు, వాహన చోదకులపై దాడి చేస్తున్నాయి. కుక్క కాటుకు గురైన గ్రామస్తులు ఇంజక్షన్లు వేయించుకునేందుకు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

భయాందోళనలో ప్రజలు

కుక్కల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పిల్లలు, మహిళలపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటనలు నిత్యం జరుగుతున్నాయి. అంతే కాకుండా మండల కేంద్రంలోని కొన్ని గృహాల్లోకి కుక్కలు చొరబడి హంగామా సృష్టిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాంసం విక్రయదారులు వ్యర్థ పదార్థాలను ఊరికి దూరంగా బహిరంగ ప్రదేశాల్లో పారబోసేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపడితే కొంతమేర పరిస్థితి అదుపులోకి వస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. అంతే కాకుండా వివిధ గ్రామాల్లో ఉన్న కుక్కలను పట్టుకుని వాటిని గ్రామాలకు దూరంగా వదలివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

గ్రామాలలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. ప్రతి వీధిలో దాదాపు పదికి పైనే కుక్కలు తిరుగుతూ భయపెడుతున్నాయి. రాత్రి సమయాల్లో బైక్‌లపై వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. చికెన్ దుకాణాలలోని మాంసాల వ్యర్థాలు రోడ్ల పక్కనే వేస్తుండడంతో రోడ్లపై తిష్టవేసుకుని ఉంటున్నాయి. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

కె.శ్రీనివాసరావు, బెల్లంకొండ

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేద్దాం

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, పీహెచ్‌సీ వైద్యులు



క్రోసూరులోని టీబీ అవగాహన ర్యాలీలో వైద్యులు తదితరులు

క్రోసూరు: టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రత్యేక క్యాంపైన్‌ను విజయవంతం చేద్దామని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సిరి చందన, డాక్టర్ రాంబాబు నాయక్, ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. గురువారం క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహించి పొగ, మద్యం తాగే వారు, గతంలో టీబీ వచ్చి నయం అయిన వారు, హెచ్ఐవీ పాజిటివ్, గర్భిణులు, షుగర్, దీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారిని గుర్తించి వారికి టీబీ వచ్చిన యెడల ఆరు నెలల చికిత్స ఉచితంగా అందించడం జరుగుతుందని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరిచందన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, కళ్లెలో రక్తం పడటం, ఛాతి నొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, బరువు, ఆకలి తగ్గటం, అలసట వంటివి క్షయ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. డాక్టర్ రాంబాబునాయక్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని కళ్లె పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చని, నూతన విధానాల ద్వారా టీబీ పరీక్షలు చేయబడతాయని తెలిపారు. శిఖాశ్యాంసన్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడిని గానీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ను గానీ, ఆరోగ్య కార్యకర్తను గానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జానీ బాషా, స్టాఫ్‌నర్స్ రాణి, ఫార్మసిస్ట్ ఫాతిమా, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆనంద్ కుమార్

సత్తెనపల్లి: పట్టణంలో పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ ఆదేశించారు. మున్సిపల్ శానిటేషన్ కార్మికులు పట్టణంలో చేపడుతున్న పరిసరాల పరిశుభ్రతను గురువారం ఆయన పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రోడ్లపై వేసే చెత్త చెదారాన్ని పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే వ్యాధులు దరిచేరే అవకాశం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి రోడ్లు, కాలువల్లో చెత్త చెదారం పడవేయకుండా శానిటేషన్ కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. ఆయనతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ సారథి, సిబ్బంది ఉన్నారు.

సమస్యల నడుమ మోగిన బడి గంట

ఆటలకు సెలవులకు స్వస్తి పలికి వేసవి సెలవుల అనంతరం గురువారం అన్ని యాజమాన్యాల కింద పనిచేసే పాఠశాలలు సమస్యల నడుమ పునః ప్రారంభమయ్యాయి. ఇన్నాళ్లు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు బడి బాట పట్టారు.

- పాఠశాలలు పునః ప్రారంభం
- తొలిరోజు అంతంత మాత్రంగానే హాజరు
- పలు చోట్ల విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ
- విద్యార్థులకు అందని విద్యార్థి మిత్ర కిట్లు



పెదమక్కెనలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు



గుడిపూడి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



తొలిరోజు తరగతి గదిలో విద్యార్థులు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: 2025–26 విద్యా సంవత్సరానికి గాను గురువారం బడి గంట మోగింది. సత్తెనపల్లి మండల వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు అన్ని రకాల పాఠశాలలు మొత్తం 92 ఉండగా విద్యార్థులు 7,028 మంది ఉన్నారు. మొదటి రోజు 4,516 మంది విద్యార్థులు హాజరు కాగా 2,516 మంది గైర్హాజరయ్యారు. 88 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేయగా 4,412 మంది విద్యార్థులు భోజనం చేశారు. 4 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేయలేదు. మొదటి రోజు కొన్ని పాఠశాలల్లో పిల్లలు మరీ తక్కువ సంఖ్యలో కనిపించగా ఉపాధ్యాయులు కొన్ని చోట్ల ప్రార్థన కూడా నిర్వహించ లేదు. మండలంలోని పెదమక్కెన, గుడిపూడి పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారులు ఏ శ్రీనివాసరావు, ఏ రాఘవేంద్రరావు గురువారం పరిశీలించారు. పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. సన్నబియ్యం నాణ్యతను పరిశీలించి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. గుడిపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

అందని విద్యార్థి మిత్ర కిట్‌లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విద్యా రంగంలో పలు సంస్కరణలు తీసుకుని వచ్చారు. విద్యార్థులు చదువులకు ఏ తల్లిదండ్రులు కూడా ఇబ్బందులు పడకూడదని విద్యా కానుక పంపిణీకి శ్రీకారం చుట్టారు. విద్యా కానుకలో పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, షూస్, సాక్స్, బెల్టు, యూనిఫాంతో పాటు డిక్షనరీలతో కూడిన విద్యా కానుక కిట్లను పాఠశాలలు పునః ప్రారంభం రోజే విద్యార్థులకు అందించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జగనన్న విద్యా కానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా పేరు మార్చింది. అయితే ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు చేరాయి తప్ప, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, బెల్టులు, స్కూల్ బ్యాగులు, యూనిఫాం, షూస్, బెల్టులు లాంటివి ఇంకా రాలేదు. పాఠశాలలు గురువారం పునః ప్రారంభం కావడంతో కొన్ని చోట్ల పాఠ్యపుస్తకాలు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన సామగ్రి రావలసి ఉంది. విద్యార్థి మిత్ర కిట్‌లు అందించే విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

అమరావతి: వేసవి సెలవులు పూర్తయి బడిగంట మోగటంతో గురువారం విద్యార్థులు మరలా పుస్తకాల సంచి సర్దుకుని బడిబాట పట్టారు. వేసవి సెలవుల అనంతరం మండలంలో సుమారు 8,500 మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లటానికి సమాయత్తమయ్యారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11 వరకు సుమారు 50 రోజుల పాటు ఆటపాటలు, బంధువులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా వేసవి సెలవులను గడిపిన విద్యార్థులు మరలా చదువుపై దృష్టి మరల్చాటానికి సిద్ధమయ్యారు. బడులు తెరుచుకోవటంతో యూనిఫాం, పుస్తకాలు, ఫీజులు, బూట్లు తదితర వస్తువుల కొనుగోళ్లతో మళ్లీ హడావుడి నెలకొంది. గురువారం మండల పరిధిలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజున విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉంది. స్కూల్ యూనిఫాంలో కాకుండా మామూలు దుస్తులలో విద్యార్థులు పాఠశాలలకు హాజరైనారు. విద్యా శాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే 3 వేల మందికిపైగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. యూనిఫాం, బూట్లు, సాక్స్‌లు, టై, బెల్ట్‌లు ఇంకా పాఠశాలలకు చేరలేదు. పాఠశాలల అభివృద్ధికి నిర్వహించే నాడు-నేడు పథకం రెండవ విడత పనులు మండలంలోని 30 పాఠశాలల్లో నిధుల విడుదలలో జాప్యం కారణంగా పూర్తి కాలేదు. స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో పాలక మండలి సభ్యులు ఆళ్లగడ్డ కిరణ్, పారేపల్లి సత్యనారాయణ, భువనగిరి సాయిబాబు, మంగిశెట్టి వెంకటకోటేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారంతోనే ఆయకట్టు రైతులకు సాగునీరు

- సత్తెమ్మతల్లి ఎత్తిపోతల పథకం ఛైర్మన్ నరసింహారావు
- అందని ప్రభుత్వ సహకారం



గ్రంథశిరిలోని ఎత్తిపోతల పథకం

అచ్చంపేట: మండల గ్రంథశిరిలోని ఎత్తిపోతల పథకం నిర్వహణలో పలు సమస్యలు ఎదురై ప్రభుత్వం నుంచి నిధులు రాక, స్కీము ఆగిపోయే పరిస్థితులు వచ్చినా, దాతల సహకారంతో సమస్యలు పరిష్కరించుకుంటూ ప్రతి యేటా 3000 ఎకరాలకు పైగా సేద్యపు భూములకు సజావుగా సాగునీరు అందిస్తున్నామని సత్తెమ్మతల్లి ఎత్తిపోతల పథకం ఛైర్మన్ రావెళ్ల నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కీము 2008లో సత్తెమ్మతల్లి ఎత్తిపోతల పథక రైతు అభివృద్ధి సంఘం పేరుతో రిజిస్టరు కాబడిందన్నారు. కాంట్రాక్టర్లు, నాణ్యతా లోపాల వల్ల పైపులైన్లకు తరచూ లీకులు ఏర్పడుతున్నాయని, విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండటంతో సంబంధిత శాఖకు తెలియజేసి సకాలంలో మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరు ఇవ్వగలిగామన్నారు. అయితే 2015 నుంచి 2019 వరకు స్కీము నిర్వహణకు కొందరు అంతరాయం ఏర్పరచి స్కీముకు తాళాలు వేయించి తమపై హైకోర్టులో అనేక కేసులు నమోదు చేయించారన్నారు. వాటన్నింటి పరిష్కరించుకుని 2019 నుంచి 2024 వరకు ఆయకట్టు రైతులందరకీ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు ఇచ్చామన్నారు. అయితే గత యేడాది కాలంలో స్కీము పైపులైన్లు, ట్రాన్స్‌ఫార్మర్స్ మరమ్మతులకు గురికావడంతో దాతల సహాయంతో వాటిని మరమ్మతు చేయించి, రైతులకు యథావిధిగా సాగునీరు అందజేస్తున్నామని చెప్పారు. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఇలా మరమ్మతులకు గురైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు 45కు పైగా ఉండగా ప్రభుత్వం నుంచి నిధులు రాక అవి ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే గాని అవి మళ్లీ రన్నింగ్‌లోకి రాలేని పరిస్థితులున్నాయని చెప్పారు. మిగిలిన స్కీములులాగా తమ స్కీము కూడా ఆగిపోకూడదని దాతల నుంచి నిధులు సేకరించి స్కీము నడుపుతున్నామని ఛైర్మన్ తెలిపారు. దయచేసి రైతులకు జీవనాధారమైన స్కీముకు రాజకీయ రంగు పులమొద్దని, ఆయకట్టు రైతులంతా కలసికట్టుగా ఉండి స్కీమును సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ: రైతులు అన్నదాత సుఖీభవ పథకాన్ని పొందేందుకు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ గురువారం చెప్పారు. గతంలో మాదిరిగా ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేనందున తప్పనిసరిగా వేలిముద్ర ద్వారానే ఈ-కేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. అర్హులైన రైతులు రైతుసేవా కేంద్రాలలోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి వేలిముద్ర ద్వారా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి గరుడ సేవ



సత్తెనపల్లి: జ్యేష్ఠ మాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి విశేషంగా శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. రెండు గంటల పాటు జరిగిన స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్ల పట్టు, రంగురంగుల ఎండు ఫలాలు, వట్టివేరు, పసుపు రోజా మాలలను శ్రీవారికి అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజస్వామి శ్రీ, భూ, పురుష, నీలా, నారాయణ సూక్తాలను పఠిస్తుండగా పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం పురవీధులలో మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డుపైనే మురుగు



అబ్బురాజుపాలెం కాలచక్ర రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పెదకూరపాడు: మండలంలోని అబ్బురాజుపాలెం పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న కాలచక్ర రోడ్డుపై ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు ముందుకు సాగే మార్గం లేకపోవడంతో రోడ్డుపై నుంచి పారుతుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి వచ్చే మురుగు నీరు ముందుకు పోయే మార్గం లేకపోవటంతో ఇలా ప్రధాన రహదారిపై పారుతూ దుర్వాసన వెదజల్లుతుంది. మురుగు నీటితో దోమలు పెరిగే అవకాశం అధికంగా ఉందని కాలనీ వాసుల వాపోతున్నారు. అధికారులు మురుగు నీరు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

దుర్వాసన వెదజల్లుతున్న వైనం

సత్తెనపల్లి ఏవోగా సుబ్బారెడ్డి



సత్తెనపల్లి: సత్తెనపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిగా బి.సుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారెడ్డి బదిలీపై సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి(ఏవో)గా వచ్చారు. ఇప్పటి వరకు సత్తెనపల్లి ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీధర్ రెడ్డి బదిలీపై ముప్పాళ్ల మండల వ్యవసాయ అధికారిగా వెళ్లారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు



సత్తెనపల్లి: పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. తూనికలు కొలతల శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్ సైదా తనిఖీలు చేపట్టి బియ్యంతో తూకాల్లో మోసాలు, సెల్‌ఫోన్ చార్జర్లు, కాంబో ప్యాకులపై అడ్రస్సు లేకపోవడం, సిగరెట్లు, స్వీట్స్, బేకరీ తయారీలో నిబంధనలు పాటించకపోవడం తదితర వాటిని గుర్తించారు. మొత్తం నాలుగు కేసులు నమోదు చేశారు.

సాయిబాబా ఆలయ అధ్యక్షుడు రత్తయ్యకు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రధాన రహదారిలో షిరిడీ సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన చల్లా రత్తయ్య మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సత్తెనపల్లి సబ్ కోర్టు మాజీ ఏపీపీ బగ్గి నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా చల్లా రత్తయ్య ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, దేవాలయం కార్యదర్శి జె.సాంబిరెడ్డి, స్థానికులు ఉన్నారు.

రైతులందరికీ ఈకేవైసీ

రొంపిచర్ల: మండలంలోని రైతులు అందరూ అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందేందుకు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివలలిత తెలిపారు. రైతులందరూ సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు.